Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 300 | హైదరాబాద్ | సోమవారం 14 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# సాంకేతికతను ఖనిజాలను అస్త్రాలుగా వాడుకోవద్దు

## ప్రపంచదేశాల పురోగతికి, శ్రేయస్సుకు అది ఆటంకం కలిగిస్తుంది



- బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన
- మానవాళి కోసం కూటమి ఉమ్మడిగా కృషి చేయాలని పిలుపు
- సహకారం, సమ్మిళిత వృద్ధి ద్వారా ముందుకు సాగాలని వెల్లడి

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సామాన్య ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సవాళ్లను ఎదుర్కొని మానవాళి కోసం బ్రిక్స్ కూటమి ఉమ్మడిగా కృషి చేయాలని, సహకారం, సమ్మిళిత వృద్ధి ద్వారా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివారం బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ప్రజాతీర్పు)

ఆధునిక సాంకేతికతను, అరుదైన ఖనిజాలను కొన్ని దేశాలు స్వలాభం కోసం అస్త్రాలుగా మార్చుకోవడంపైఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రపంచదేశాల ఉమ్మడి పురోగతికి, శ్రేయస్సుకు ఆటంకం కలిగిస్తుందన్నారు. గ్లోబల్ సౌత్‌లోని అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలకు విలువ ఇవ్వడం, భాగస్వామ్యం ఏర్పర్చుకోవడం వల్ల అవి బ్రిక్స్‌ను ఎక్కువగా విశ్వసిస్తున్నాయని చెప్పారు. మన వైవిధ్యమే మన గుర్తింపు, మన సహకారమే మన స్ఫూర్తి, మన పురోగతి సకల మానవాళికి సేవగా మారాలని బ్రిక్స్ సభ్యదేశాలకు పిలుపునిచ్చారు. అస్థిరమైన భౌగోళికరాజకీయ వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాల మధ్య సహకారం బలోపేతం కావడం అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. కూటమికి భారత్ అధ్యక్షత వహించడం నిబ్బరం, ఆవిష్కరణ, సహకారం మరియు సుస్థిరత అనే నాలుగు స్తంభాలపై కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఈ నాలుగు మూలస్తంభాల ఆధారంగా బ్రిక్స్ ద్వారా సమ్మిళిత ప్రపంచ వృద్ధిని భారత్ ఆకాంక్షిస్తోందని వ్యాఖ్యానించారు. ఎందుకంటే


-2వ పేజీలో

# సీఎం రేవంత్‌రెడ్డి.. ఇమేజ్ డ్యామేజ్!

## కొండాకు మళ్లీ ప్రాధాన్యం.. కేబినెట్ హెూదాతో పదవి

- మంత్రిగా బర్తరఫ్ చేసిన కొద్దిరోజులకే..
- అధిష్ఠానం నుంచి పిలుపు
- కార్యకర్తల సమావేశంలో కొండా సురేఖ హాట్ కామెంట్స్
- అదే జరిగితే.. సీఎం మాట వినేదెవరు?
- అటు పార్టీలో.. ఇటు సర్కార్‌లో ఇబ్బందులే..

కొండా సురేఖ సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యగా మారారు. ఆమె చుట్టూ తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు సీఎం రేవంత్ ఇమేజ్‌కు డ్యామేజ్ చేస్తున్నాయి. ప్రచారంలో ఉన్నట్లు జరిగితే సీఎం రేవంత్‌రెడ్డికి ఇటు పార్టీలో అటు ప్రభుత్వంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకానున్నాయి. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించినప్పటికీ, ఆమె పార్టీ పట్ల చూపుతున్న వైఖరి, కాంగ్రెస్ అధిష్ఠానం ఆమెకు ప్రత్యామ్నాయ పదవిని కట్టబెట్టే యోచనలో ఉందన్న ప్రచారం సీఎం రేవంత్‌రెడ్డికి ఇబ్బందికరంగా మారనుంది.



(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

సురేఖకు కేబినెట్ హోదా కలిగిన కీలక కార్పొరేషన్ చైర్మన్ పదవితో పాటు తగిన ప్రాధాన్యత ఉన్న బాధ్యతలను అప్పగించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లుగా టాక్ నడుస్తోంది. అయితే, ఈ పరిణామాలు అధికార వర్గాల్లోనూ, పార్టీ క్యాంపులోనూ అనేక విశ్లేషణలకు తావిస్తున్నాయి.

### కొండా దంపతుల దూకుడు

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత కొండా దంపతులకు అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చిందన్న

-2వ పేజీలో



# ఐక్యంగా ఉన్నప్పుడే రాజకీయంగా అవకాశాలు

## ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన.. ప్రభుత్వం వెన్నంటి ఉంటుందని భరోసా

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ప్రజాతీర్పు)

రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలంటే.. తగిన అవకాశాలు, ప్రాధాన్యం పొందాలంటే ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో ప్రసంగించారు. ఆర్యవైశ్య సమాజం ఆర్భాటాలు, ప్రచారాలకు దూరంగా ఉండటంతో రావాల్సినంత

-2వ పేజీలో





# మూడేళ్లలోపు 21 రాష్ట్రాల్లో యూసీసీ

## మోదీ శకంలో అన్నీ మారుతున్నాయ్

ముంబై, సెప్టెంబరు 13 (ప్రజాతీర్పు)

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాలు కొలువుదీరిన 21 రాష్ట్రాల్లోనూ 2029 ఏడాదిలోపు ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)ని అమలుచేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గత పుష్కర కాలంలో ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రప్రభుత్వం సాధించిన ఘనత, మోదీ నాయకత్వంలో గత పాతికేళ్లలో బీజేపీ ప్రయాణం, మోదీ జన్మదినంను గుర్తుచేస్తూ సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ జరగబోతోందని ప్రకటించాక పలు అంశాలపై ఆదివారం ముంబైలో అమిత్‌షా మీడియాతో మాట్లాడారు. "త్రిపుల్ తలాఖ్‌ను రద్దుచేసి ముస్లిం మహిళలకు సమాన హక్కులు కల్పించాం. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యూసీసీ అమలవుతోంది. 2029లోపు ఎన్‌డీఏపాలిత అన్ని రాష్ట్రాల్లో ఇది అమలయ్యేలా చేస్తా"అని అన్నారు. 2029లో

-2వ పేజీలో



# శాకాహారం మంట!

## బ్రిక్స్ గాలా డిన్నర్‌లో శాకాహార భోజనంపై రాహుల్ అసహనం

- 80% మంది భారతీయులు మాంసాహారులేనని వెల్లడి
- శాకాహారాన్ని బీజేపీ బలవంతంగా తినిపిస్తోందని ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ప్రజాతీర్పు)

బ్రిక్స్ దేశాధినేతలతోపాటు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పెద్దసంఖ్యలో దౌత్యాధికారులకు ప్రధాని మోదీ శనివారం ఇచ్చిన విందులో కేవలం శాకాహార భోజనం వడ్డించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అసహనం వ్యక్తంచేశారు. అత్యధికశాతం భారతీయులు మాంసాహారులని తెల్సి కూడా మోదీ సర్కార్ కేవలం

-2వ పేజీలో



# 'బలమే హక్కు' నిలవదు

## ద్వంద్వ ప్రమాణాలను వీడాలి

గ్లోబల్ సౌత్ కోసం ఐక్యతతో కొత్త అధ్యాయాన్ని లిఖించాలి.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ప్రజాతీర్పు)

అంతర్జాతీయ వ్యవహారాలను బలం నిర్ణయించకూడదని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బ్రిక్స్ శిఖరాగ్ర సమావే శంలో అన్నారు. ఆయన సమాన ప్రపంచ నియమాలు, సంస్థాగత సంస్కరణలు, ఏఐ, ఆర్థిక సంబంధాలలో సహకారం కోసం పిలుపునిచ్చారు. వాణిజ్యం, తయారీ, పెట్టుబడులు, సాంకేతిక సహకారాన్ని పెంపొందించేందుకు ఐదు సూత్రాలను ఆయన ప్రతిపాదించారు. సరఫరా గొలుసులను (సప్లై చైన్లను) కాపాడటానికి, ఒక పెద్ద సమీకృత మార్కెట్‌ను

-2వ పేజీలో



# సమగ్ర దృక్పథాన్ని సంధించాలి

## అప్పుడే ప్రపంచ సవాళ్లను ఎదుర్కోగలం

చమురు ఓడలకు కొత్త బీమా యంత్రాంగం ఉండాలి

బ్రిక్స్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ప్రజాతీర్పు)

తీవ్రమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో సమగ్ర దృక్పథాన్ని సంధించాలని, అవలంబించాలని బ్రిక్స్ దేశాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. చమురు రవాణా చేసే ఓడలకు ఒక కొత్త బీమా

-2వ పేజీలో

# సాంకేతికతను ఖనిజాలను అస్త్రాలుగా వాడుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)



కూటమిలో అభివృద్ధి చేసిన పరిష్కారాల ప్రయోజనాలు కేవలం భారత్‌కే పరిమితం కాకూడదని, గ్లోబల్ సౌత్ దేశా లకు సైతం అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు స్పష్టంచేశారు. కూటమిలో అందరి సహకారం, మద్దతుతో మన ఉమ్మడి దృక్పథాన్ని పరస్పర ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలగడం సంతోషాన్నిస్తోందని మోదీ ఉద్ఘాటించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలు, ఉద్రిక్తతల కారణంగా సామాన్య ప్రజలే అధికంగా నష్టపోతున్నారని మోదీ గుర్తుచేశారు. మహమ్మా రులు, వాతావరణ విపత్తులు, సరఫరా వ్యవస్థలో అంతరా యాల వంటివి నేటి పరస్పర అనుసంధానిత ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని నిరూపించాయని తెలియజేశారు. అందుకే బ్రిక్స్ కూటమిలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం, తక్షణ చర్యలు చేపట్టడం ముఖ్యమని వివరించారు.

అంటువ్యాధుల నివారణ, వాటిపై స్పందించేందుకు 'బ్రిక్స్ సమగ్ర ముందస్తు హెచ్చరిక వ్యవస్థ'ను ఏర్పాటు చేయడానికి అంగీకరించామని అన్నారు. అలాగే విపత్తు నిర్వహణ కోసం 'ముందస్తు హెచ్చరిక సమాచార అనుసంధాన మార్గదర్శకాలు'రూపొందించినట్లు తెలిపారు. సప్లై చైన్లను మరింత విశ్వసనీయంగా, దృఢంగా మార్చడానికి 'బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేసన్ ఫ్రేమ్‌వర్క్' తోడ్పడుతుందని అన్నారు. ఆవిష్కరణల విభాగంలో బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ మన స్టార్టప్‌లను, ఇంక్యుబేటర్లను ఒకదానితో ఒకటి అనుసంధానిస్తుందని వెల్లడించారు. 'బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్'ను ప్రతిపాదించినట్లు స్పష్టంచేశారు. సాంకేతికతను, కీలక ఖనిజా లను ఆయుధాలుగా మార్చడం మన ఉమ్మడి పురో గతికి ఆటంకం కలిగిస్తుందన్నారు. అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడంలో సమ్మిళితత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మోదీ చెప్పారు. బ్రిక్స్ కూటమిలోని వివిధ వేదికల ద్వారా స్నేహం, భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించినట్లు ప్రధాని వివరించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కావడం సరైంది కాద న్నారు. పారిశ్రామికవేత్తలు, రైతులు, పరిశోధకులు, మహిళలు, యువత, సామాన్య పౌరులను ఇందులో క్రియా శీల భాగస్వాములుగా మార్చ డానికి ప్రయత్నిస్తున్నట్లు తెలి పారు. 'బ్రిక్స్ కనెక్ట్'ద్వారా నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, పనిలో మహిళల భాగస్వామ్యం, సామాజిక భద్రత, సామర్థ్య పెంపుదల వంటి అంశాలను ప్రోత్సహించామని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలను పరిజ్ఞానం, ఆర్థిక వనరులు, కొత్త మార్కెట్లతో అనుసంధానించేందుకు 'బ్రిక్స్ ఎంఎస్ఎంఈ కోఆపరేషన్ పోర్టల్'ను ప్రారంభించామని వెల్లడించారు. మన నగరాల మధ్య ఉత్తమ విధానాల పరస్పర బదిలీని సులభతరం చేసేందుకు 'బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్'ను ఏర్పాటు చేశామన్నారు.

### భావి తరాల పట్ల అది మన బాధ్యత

భారతీయ నాగరికతలో ప్రకృతికి కన్నతల్లి స్థానం ఉందని గుర్తుచేశారు. అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలని శతాబ్దా లుగా విశ్వసిస్తున్నామని ఉద్ఘాటించారు. మానవా భివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పట్ల కచ్చితంగా సమతుల్యత పాటిం చాలని తేల్చిచెప్పారు. భావి తరాల పట్ల అది మన బాధ్యత అని సూచించారు. ఆ దిశగా పలు అంశాల్లో తాము పురో గతి సాధించామన్నారు. స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వ కోసం 'బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేశా మని, ఇది స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వ సనీ యంగా, సమర్థవంతంగా మార్చడానికి, అందరికీ అందు బాటులోకి తీసుకురావడానికి దోహదపడుతుందని ప్రధాని చెప్పారు.

# ఐక్యంగా ఉన్నప్పుడే రాజకీయంగా అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వంలో ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చామని.. కొడంగల్‌లోని మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. "సమాజ సంక్షేమానికి మీరు అందిస్తున్న తోడ్పాటును గుర్తించి ప్రభుత్వం మీ వెన్నంటి ఉంటుంది. ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారంతో పాటు అవసరమైన అన్ని రకాల ఆర్థిక సహాయాన్ని అందిస్తాం. నేను మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తా. ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారు. చాలామంది పేదలు ఉన్నా పేదరికాన్ని కడుపులోనే దాచుకుని గౌరవంతో జీవించే స్వభావం మీది. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి పూచీకత్తు లేకపోయినా పేదలకు ఆర్థిక సహాయం చేసే కమ్యూనిటీ" అని సీఎం కొనియాడారు. "ప్రపంచంలో వ్యవసాయం, వ్యాపారం అనే రెండు ప్రధాన వృత్తులు ఉన్నాయి. వ్యాపారంలో రాణించి ఆటుపోట్లను ఎదుర్కొన్న అనుభవం ఆర్యవైశ్యుల సొంతం. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం, వివాహాలు, వాహనాల కొనుగోలు వంటి నిర్ణయాల్లో మీ సలహాలు తీసుకుంటారు. ముందుచూపు అనేది మీ రక్తం, డీఎన్‌లోనే ఉంది. ఈ ఆత్మ గౌరవ భవనం పేద ఆర్యవైశ్య కుటుంబాలకు సంపూర్ణంగా ఉపయోగపడాలి.

ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి.. చిత్రంలో నవీన్ యాదవ్, దయానంద్ గుప్తా, రజితారెడ్డి, బొంతు శ్రీదేవి, సూర్యనారాయణగుప్తా, గణేశ్‌గుప్తా, బండారి లక్ష్మారెడ్డి, టీజీ వెంకటేశ్, అమరవాది లక్ష్మీనారాయణ, మధుయాస్కీ తదితరులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఏకైక నాయకుడు మహాత్మాగాంధీ. ఆయన ఆర్యవైశ్యుల బిడ్డ కావడం దేశానికే గర్వకారణం. లాలాలజపతిరాయ్, సీతారాం కేసరి, పెండేకంటి వెంకటసుబ్బయ్య వంటి ప్రముఖ నాయకులు ఈ సామాజికవర్గం నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున విశేష సేవలు అందించారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. నేను మొదటిసారి ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలిలో దూకుడుగా వ్యవహరిస్తున్నప్పుడు రోశయ్య దగ్గరికి పిలిచారు. నా రాజకీయ భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. ఆవేశంతో కాదు అనుభవంతో ముందుకెళ్తే రాజకీయాల్లో పైకి వస్తావని సుదీర్ఘ భవిష్యత్తు ఉందని ఆశీర్వదించారు. రోశయ్యకు సముచిత గౌరవాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున విగ్రహం ఏర్పాటు చేస్తే కొంతమంది విమర్శలు చేశారు. 'నాలుగు దశాబ్దాల క్రితమే నేను బల్కంపేటకు వచ్చా.. మంచైనా, చెడైనా నాకు హైదరాబాదే' అని రోశయ్య ఒక సందర్భంగా చెప్పారు. ఆయన మాటలు గౌరవించి నగరంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. 'సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడినంత గట్టితనం చేతల్లో ఉండదు.. అదే గట్టితనం ఉంటే తెలంగాణలో ఎంతో మంది కటకటాల్లోకి పోయేవారు' అని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. సూర్య భగవానుడు ఎలా వెలుగునిస్తున్నారో.. అలాగే సీఎం తెలంగాణ ప్రజలకు సేవలందిస్తున్నారంటూ రేవంత్ పేరు గురించి వర్ణించారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తన వంతుగా రూ.కోటి విరాళం ప్రకటించారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి డా.వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, సూర్యనారాయణగుప్తా, ప్రకాశ్‌గౌడ్, నవీన్‌యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, దామోదర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# శాకాహారం మంట!

(మొదటి పేజీ తరువాయి)



శాకాహారం వడ్డించడంలో ఆంతర్యమేంటని ఆయన నిలదీశారు. ఈమేరకు రాహుల్ ఆదివారం ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. "గణాంకాలను మీకు గుర్తుచేస్తున్నా. 80 శాతం మంది భారతీయులు మాంసాహారులే. మరీ ముఖ్యంగా భారతీయ మాంసాహార వంటకాలు ఎంతో రుచికరంగా ఉంటాయి. నా చెల్లి చేసిన శాకాహార చిరుతిండి ఛోలే భటూరేలా మాంసాహారం ఎంతో పసందుగా ఉంటుంది. అలాంటప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్రిక్స్ సంబంధిత విందులో మాంసాహారాన్ని విస్మరించాల్సిన అవసరం ఏమొచ్చింది? "అని రాహుల్ మోదీ సర్కార్‌కు సూటి ప్రశ్న వేశారు. పోస్ట్‌తోపాటు తన సోదరి చేసిన చిరుతిండి ఫొటోను పోస్ట్‌చేశారు.

భారత్‌తోపాటు విదేశాల్లోనూ మాంసాహార ప్రియులే అత్యధికమని, అలాంటి బ్రిక్స్ దేశాల నుంచి వచ్చిన విదేశీ అతిథులకు శాకాహారం బలవంతంగా వడ్డించాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వ విధానాన్ని తప్పుబట్టింది. "బ్రిక్స్ సదస్సు ప్రాధాన్యత దృష్ట్యా ప్రపంచదేశాల అతిథులు ఈ కార్యక్రమానికి వచ్చి విందు ఆరగించారు. వీళ్లు ఏ ఆహారం తినాలో బీజేపీ ప్రభుత్వం నిర్ణయిస్తుందా?


ఇప్పటికే భారతీయులు ఏం తినాలో బీజేపీ ఆదేశిస్తోంది. ఇక విదేశీయులకు శాకాహారాన్ని బలవంతంగా తినిపించడం ఎంతవరకు సబబు?"అని కాంగ్రెస్ మీడియా విభాగ చీఫ్ పవన్ ఖేడా ఆగ్రహం వ్యక్తం చేశారు. "చవులూరించే ఎంతో మాంసాహార వంటకాలకు భారత్ పెట్టిందిపేరు. వాటిని విదేశీ అతిథులు రుచి చూడకుండా చేసి భారతీయ ఆహార సంప్రదాయాలను దాచాలని చూస్తారా?"అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ విందు మెనూను పోస్ట్‌చేసింది.

### సక్సెస్‌ను కాంగ్రెస్ సహించట్లేదు: బీజేపీ

సదస్సు విజయవంతంకావడంతో కాంగ్రెస్ సహించట్లేదని, అందుకే అర్థంపర్థంలేకుండా ఆహారం గురించి విమర్శలుచేస్తోందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు. "సదస్సు గురించి వంకలుపెట్టడానికి ఏమీ లేదు. డిక్లరేషన్‌లో ఏకాభిప్రాయం సాధించి మోదీ సర్కార్ తన దక్షతను చాటింది. సదస్సు ఇలా విజయవంతంకావడం కాంగ్రెస్ సహించలేకపోతోంది. అందుకే విమర్శించడానికి మరే విషయాలు లేక చివరకు ఆహారం గురించి విమర్శలు చేస్తోంది"అని భండారీ అన్నారు. "డిక్లరేషన్‌తో విజయం సాధించిన మోదీని రాహుల్ అభినందించాల్సిందిపోయి ఈ శాకాహారం, మాంసాహారం గోల ఏంటి?"అని మరో బీజేపీ జాతీయ ప్రతినిధి తుహిన్ సిన్హా వ్యాఖ్యానించారు.

# సీఎం రేవంత్‌రెడ్డి ఇమేజ్ డ్యామేజ్!

(మొదటి పేజీ తరువాయి)



సంకేతాలు అందిన వెంటనే వారు ఆదివారం తమ అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కొండా దంపతుల దూకుడు ఏ మాత్రం తగ్గలేదన్న భావన వ్యక్తమవుతోంది. కార్యకర్తల సమావేశంలో కొండా మురళి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. "కాగితం మీద రేవంత్ రెడ్డికి సారీ అని రాసిస్తే పదవి ఉంటుందని కొండా సురేఖకు చెప్పారు.. కానీ నా పదవి పోయినా సరే నేను ఎవరికీ సారీ చెప్పను" అని సురేఖ స్పష్టం చేశారని మురళి బహిరంగంగానే తేల్చిచెప్పారు. అధినాయకత్వంతో రాజీపడే ప్రసక్తే లేదన్న సంకేతాలను ఈ వ్యాఖ్యలు స్పష్టంగా వెలువరించాయి.

### ఏం జరుగుతోంది..

సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా దంపతుల కుమార్తె తీవ్రంగా విమర్శలు చేసిన నేపథ్యంలో ఆమెను మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేశారు. ఢిల్లీ కేంద్రంగా హైడ్రామా నడిచిన తర్వాతే బర్తరఫ్ నిర్ణయం జరిగింది. ఈ బర్తరఫ్ వెనుక సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని స్వయంగా కొండా సురేఖ ఆరోపించారు. నేను కావాలా.. కొండా సురేఖ కావాలా అని అధిష్ఠానం వద్ద పట్టుపట్టి మరీ బర్తరఫ్ చేయించారని ఆమె ఆరోపించారు. ఇక సీఎంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేప థ్యంలో ఆమెను మంత్రిగా బర్తరఫ్ చేయడంతో అధిష్ఠానం వద్ద రేవంత్‌కు మంచి పట్టు ఉందన్న ప్రచారం జరిగింది. ఆయనకు ఇక ఢోకా లేదని ఆయన వర్గీయులు ప్రచారం చేసుకున్నారు. కానీ, కొద్ది రోజుల్లోనే సీన్ రివర్స్ అయ్యింది.

### కేబినెట్ హోదా..

కొండా సురేఖకు పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఆమెకు కేబినెట్ హోదాలో పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. సీఎంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన సురేఖకు మళ్లీ ప్రత్యామ్నాయ పదవిని కట్టబెడుతారా అని పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఆమెకు ఏదైనా పదవి ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇమేజ్ దెబ్బతింటుందనే వాదన బలంగా వినిపిస్తోంది. అంతేకాకుండా, ఇది పార్టీలోని ఇతర రేవంత్ వ్యతిరేక వర్గాలకు మరింత బలాన్ని చేకూర్చి, తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కొండా సురేఖ పదవి పోవడానికి సీఎంయే కారణమని ఆయనకు ఇక తిరుగులేదని.. ఆయన మాటను అధిస్థానం వింటుందని చెప్పుకున్నారు. కొండా బర్తరఫ్ తర్వాత పార్టీలో అసమ్మతి కూడా సద్దుమణిగినట్లు చెబుతున్నారు. ఈ తరుణంలో కొండా సురేఖకు ప్రాధాన్యం ఇస్తే రేవంత్‌రెడ్డి మాట ఇటు పార్టీలో.. అటు ప్రభుత్వంలో వినేవారుంటారా అన్నది చర్చనీయంశంగా మారింది. మరి ఈ క్లిష్ట పరిస్థితిలో హైకమాండ్ ఎలాంటి తుది నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతం ఉత్కంఠ రేపుతోంది.

# 'బలమే హక్కు' నిలవదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించడానికి బ్రిక్స్ కూటమి వర్ధమాన మార్కె ట్లు, గ్లోబల్ సౌత్‌తో ఉన్న తన సన్నిహిత సంబంధాలను ఉపయోగించుకోవాలని అన్నారు. గ్లోబల్ సౌత్ కోసం ఐక్యతతో కొత్త అధ్యాయాన్ని లిఖించాలన్నారు. నియమాలు లేని ప్రపంచం ట్రాఫిక్ లైట్లు లేని కూడలి లాంటిదని సూచించారు. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాలూ కలిసి రచించాలని, బ్రిక్స్ అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను పరిరక్షించాలని స్పష్టం చేశారు. తమతమ బలాలతో సంబంధం లేకుండా అన్ని దేశాలూ అంతర్జాతీయ సమాజంలో సమాన సభ్యులే నని పేర్కొన్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఆదివారం ముగింపు సభలో షీజిన్‌పింగ్ ప్రసంగిస్తూ, 'బలమే హక్కు' అనే తర్కాన్ని ఎప్పుడో విడనాడాల్సిందని స్పష్టం చేశారు. 'గ్లోబల్ సౌత్ కోసం ఐక్యత ద్వారా బలానికి సంబం ధించిన ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించే దిశగా కృషి చేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. 'నియమా లు లేని ప్రపంచం ట్రాఫిక్ లైట్లు లేని కూడలి లాంటిదని, అక్కడ గందరగోళం, అస్తవ్యస్తత దాదాపు ఖాయమని వెల్లడించారు. నిష్పక్ష పాతం, న్యాయం అనేవి సార్వత్రిక ఆకాంక్షలని, అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాలూ కలిసి రచించాలని స్పష్టం చేశారు. గ్లోబల్ సౌత్ దేశాలు సంయుక్తంగా 'అంతర్జాతీయ వ్యవహారాలలో చట్టబద్ధ పాలనను పరిరక్షించా లన్నారు. సార్వభౌమ సమానత్వం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, వివాదాల శాంతియుత పరిష్కారం వంటి అంతర్జాతీయ సంబంధాల ప్రాథమిక నిబంధనలను కాపాడాలని కోరారు. అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ నిబంధనలు అందరికీ వర్తించేలా చూడాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంలో, 'ద్వంద్వ ప్రమాణాలను' వీడాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాశ్చాత్య శక్తులను ఉద్దేశించినవిగా భావిస్తున్నారు. 'అన్ని దేశాలు, వాటి పరిమాణం, బలం లేదా సంపదతో సంబంధం లేకుండా, అంతర్జాతీయ సమాజంలో సమాన సభ్యులేనని జిన్‌పింగ్ తేల్చిచెప్పారు. 'గ్లోబల్ సౌత్ దేశాలు బహుళప క్షవాద పతాకాన్ని ఉన్నతంగా ఎగురవేయాలని, ఐక్యరాజ్యసమితి అధికారాన్ని, పాత్రను నిలబెట్టాలని అన్నారు. సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో, సామర్థ్యాన్ని పెంచడంలో బహుళపక్ష సంస్థలకు మద్దతు ఇవ్వాలని కోరారు. అంతర్జాతీయ వ్యవహారాలలో అన్ని దేశాల సమాన భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని ఆయన పునరుద్ఘా టించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి అంతర్జాతీయ ఆర్థిక నిర్మాణంలో సంస్కరణలు తీసుకురావాలని కూడా చైనా అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

బ్రిక్స్ సహకారాన్ని పెంపొందించడానికి షీ జిన్‌పింగ్ ఐదు సూత్రాల ప్రణాళికను ఆవిష్కరించారు. సమ్మిళిత కృత్రిమ మేధ వ్యవస్థను ఏర్పాటు చేయడం, వాణిజ్యంతో పాటు పెట్టుబడులను సులభతరం చేయడం, డిజిటల్ పరిశ్రమ సంబం ధాలను బలోపేతం చేయడం, 'తెలివైన తయారీ'ని ముందుకు తీసుకెళ్లడం, ఉమ్మడి శాస్త్ర సాంకేతిక అభివృద్ధి కార్యక్ర మాన్ని ప్రారంభించడంపై దృష్టి సారించాలని స్పష్టం చేస్తూ వాటి గురించి వివరించారు.

# సమగ్ర దృక్పథాన్ని సంధించాలి

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగం ఉండా లని, ధాన్యం మార్కెట్ కోసం కూడా ఒక సహకార వ్యవస్థ ఉండాలని ప్రతిపాదించారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి మాస్కోపై పాశ్చాత్య శక్తులు విధించిన తీవ్రమైన ఆంక్షల మధ్య, బ్రిక్స్ సభ్య దేశాలతో పాటు గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వృద్ధి కోసం పుతిన్ ఈ కొత్త కార్యక్రమాలను ప్రతిపాదించారు 'మూలధనం, శ్రమ, సాంకేతికతలను తరలించడానికి మాకు స్వతంత్ర మార్గాలు ఉన్నాయి. వాస్తవానికి, బాహ్య ఒత్తిడితో సంబంధం లేకుండా మేము పనిచేయగలం' అని అన్నారు. న్యూఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం ఆయన వ్యాఖ్యలు చేశారు. 'భీమా యంత్రాంగాన్ని, ధాన్యం మార్కెట్‌ను సృష్టించడం వంటి కొన్ని ఆశాజనకమైన కార్యక్రమాలు మా వద్ద ఉన్నా యి. ఇవి రష్యా ప్రతిపాదనలు, వాటిని ఉపయోగించుకోవాలని మేము అన్ని ఇతర సభ్య దేశాలను ఆహ్వానిస్తున్నాం' అని ఆయన స్పష్టం చేశారు.

న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ (ఎన్డీబీ) పనితీరును కూడా పుతిన్ ప్రశంసించారు. అది 140 బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహిస్తోందని అన్నారు. ప్రపంచ సవాళ్లు తలెత్తుతూనే ఉన్నందున, వాటి లక్షణాలను, మూల కారణాలను పరిష్కరించడానికి మనం సమగ్ర విధానాన్ని అవలంబించాలని పుతిన్ అన్నారు. 'గ్లోబల్ సౌత్ దేశాలు కలిసి మెరుగైన (ప్రపంచ) పాలనా నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని, సాంప్రదాయ, అసాంప్రదాయ భద్రతా ముప్పులను ఎదుర్కోవాలని తెలిపారు. తీవ్రమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ఒక స్వతంత్ర మార్గాన్ని రూపొందించడంపై బ్రిక్స్ దృష్టి సారిస్తున్నందున, దాని ప్రపంచ స్థాయి పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు అన్నారు.

# మూడేళ్లలోపు 21 రాష్ట్రాల్లో యూసీసీ

(మొదటి పేజీ తరువాయి)

సార్వత్రిక ఎన్నికలున్న విషయం తెల్సిందే. "గతంలో దేశంలో అవినీతి, కులతత్వం, వారసత్వ రాజకీయాలు తిష్టవేసి దారుణ పరిస్థితులను సృష్టించాయి. ఇప్పుడు మోదీ సారథ్యంలో కేంద్రప్రభుత్వం వాటినన్నింటినీ పారద్రోలింది. మోదీ శకం ఆరంభమైంది. ఇప్పుడంతా పనితీరు ఆధారిత రాజకీయాలే"అని షా అన్నారు. మానవసేవే మాధవ సేవ తరహాలో జనసేవే ప్రభు సేవ అనే కొత్త నినాదం షా విన్పించారు. 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను సాకారం చేసేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతున్నాం. మోదీ సారథ్యంలో గుజరాత్‌లో, దేశంలో పెను సానుకూల మార్పులొచ్చాయి. ఇప్పుడు రాజకీయ వ్యవస్థ ప్రాథమి కస్థాయిలో సంస్కరణల బాటలో పయనిస్తోంది" అని మోదీని షా కొనియాడారు.

# మ్యాపింగ్ చేయలేదా.. సాఫ్ట్‌వేర్ లోపమా?

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ(సర్)2026లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంలో ఓటర్లు.. సర్2002 ఓటర్ల జాబితాలోని తమ/తమ బంధువుల ఓటు వివరాలను నమోదు చేస్తే సరిపోతుంది..ఆపై వారు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని కేంద్ర ఎన్నికల సంఘం పదేపదే పేర్కొంది. 'సర్'రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన కేసుల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు సైతం ఇదే హామీ ఇచ్చింది. మరోవైపు ఎన్యూమరేషన్ ఫారంలో సర్2002 జాబితాలోని వివరాలు ఇచ్చినా, పెద్ద సంఖ్యలో ఓటర్లను అన్‌మ్యాప్డ్ ఓటర్లుగా గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పుడు మ్యాపింగ్ చేసుకునే అవకాశం లేదని బీఎల్‌ఓలు చెప్పడంతో ఓటర్లు విచారణకు హాజరుకాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సర్2026లో భాగంగా ప్రకటించిన ఓటర్ల జాబితాలో 2,64,87,213 మంది ఓటర్లు ఉండగా, వారిలో 92,87,577 మంది (35.06%) ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారించే ప్రక్రియ కొనసాగుతోంది. చివరిసారిగా 2002లో 'సర్'నిర్వహించి రూపొందించిన ఓటర్ల జాబితాలో తమ పేరు/తల్లిదండ్రుల పేరు/వారి తల్లిదండ్రుల పేరు ఉన్నట్టు ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేయాల్సి ఉండగా, 32,36,659 మంది ఓటర్లు ఈ వివరాలు ఇవ్వకపోవడతో వారిని అన్‌మ్యాప్డ్ ఓటర్లుగా గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నట్టు ఎన్నికల యంత్రాంగం ప్రకటించింది. ఇక ఫారంలో సర్2002 వివరాలను నమోదు చేసినా, ప్రస్తుత ఓటు వివరాలతో పోలిస్తే వ్యత్యాసాలుండడంతో మరో 60,50,918 మంది ఓటర్లకు సైతం నోటీసులు జారీ చేస్తున్నారు. చాలామంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో సర్2002 ఓటు వివరాలను ఇచ్చినా వారిని అన్‌మ్యాప్డ్ ఓటర్లుగా గుర్తించి నోటిసులిస్తుండడంతో 'సర్'ప్రక్రియలో తీవ్ర లోపాలను ఎత్తిచూపుతోంది. ఎన్యూమరేషన్ ఫారంలో ఓటర్లు ఇచ్చిన వివరాల ఆధారంగా ప్రస్తుత ఓటర్ల జాబితాలోని పేరును సర్2002 ఓటర్ల జాబితాలోని పేరుతో అనుసంధానం (మ్యాపింగ్) చేయాల్సి ఉండగా, పెద్ద సంఖ్యలో ఓటర్లను మ్యాపింగ్ చేయలేదని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో సర్2026 ప్రక్రియ ప్రారంభానికి కొన్ని నెలల ముందే..ముందస్తు సన్నాహకంగా మ్యాపింగ్ ప్రక్రియను ఈసీ చేపట్టగా, తమ పేర్లను మ్యాపింగ్ చేయాలని అప్పట్లోనే స్థానిక బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వో)కు చాలామంది ఓటర్లు అందజేశారు. ఆ తర్వాత ఎన్యూమరేషన్ ఫారంలో సైతం సర్2002 జాబితాలోని వివరాలను అందజేశారు. అయినా, తమను అన్‌మ్యాప్డ్ ఓటర్లుగా గుర్తించి ఈసీ నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారని సామాజిక మాధ్యమాల వేదిక ఓటర్లు ఆరోపిస్తున్నారు. బీఎల్‌ఓలు/ బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు/ఈఆర్వోల నిర్లక్ష్యంతో ఇలా జరిగిందా? లేక సాఫ్ట్‌వేర్ లోపాలతో జరిగిందా? అనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఇలాంటి ఉదంతాలు బయటకు వస్తున్నాయి.

# మట్టి వినాయకుల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు డిస్ట్రిక్ట్ 137A కృషి

- పర్యావరణహిత గణేష్ ఉత్సవాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యం

**కరీంనగర్, సెప్టెంబర్ 13 ప్రజా తీర్పు**



అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137గా ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుమారు 70 మందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు, నేలతో పాటు పర్యావరణానికి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. మట్టి వినాయకులను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని, పూజ అనంతరం మట్టి తిరిగి మట్టిలో కలిసిపోవడం వీటి ప్రత్యేకత అని వివరించారు. డిస్ట్రిక్ట్ 137గా ఆధ్వర్యంలో గతంలో గ్రీన్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు, 1,200 మొక్కల నాటడం వంటి పర్యావరణ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. మట్టి వినాయకుల పంపిణీ కూడా పర్యావరణహిత పండుగల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 1893లో మహారాష్ట్రలో సార్వజనిక గణపతి ఉత్సవాలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారని, అనంతరం ఈ సంప్రదాయం దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, డాక్టర్ జి.ఎం. కిరణ్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సాయి మేఘన, డాక్టర్ సాయి ప్రీతం తదితరులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్, టి.వి. రావు, బండిపల్లి వెంకటరమణ, హుజురాబాద్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ మనోజ్, ప్రసాద్, సాగర్ రెడ్డి, పులాల శామ్, అలాడి ఆనంద్ కుమార్, నాగేశ్వర్, కుమారస్వామి, వెంకన్న, వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా ప్రకటించాలి

- సిపిఐ.పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్. రామ్ చందర్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 13**

టేకులపల్లి:లి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యుడు గూగులోత్ రామ్ చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టేకులపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభకు చింత కన్నయ్య అధ్యక్షత వహించారు. ముందుగా మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఐ జాతీయ సహాయ కార్యదర్శి కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్ చందర్ మాట్లాడుతూ – "నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటం ఫలితంగానే లక్షలాది ఎకరాలు పేదలకు దక్కాయి. ఆ ఘనత సిపిఐదే. చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య. నిజమైన చరిత్రను యువతకు తెలియజేయాలి" అని అన్నారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, చండ్ర రాజేశ్వరరావు, నల్లమల గిరి ప్రసాద్ వంటి నాయకుల నేతృత్వంలో సాగిన ఈ పోరాటంలో సుమారు 5 వేల మంది ప్రాణత్యాగం చేశారని, 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేరా బాబు, శివ తేజ్, కన్నయ్య, శ్యాం బాబు, ప్రసాద్, యువరాజ్, సోనీ, అరుణ, సుగుణ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

- మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి డీజేలకు అనుమతి లేదు
- సీసీ కెమెరాలు, వాలంటీర్ల ఏర్పాటు శాంతిభద్రతలకు సహకరించాలి

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు తాండూర్ మండలం రిపోర్టర్)సెప్టెంబర్ 13**

తాండూర్ : రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తాండూర్ మండల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన, సమన్వయ సమావేశం నిర్వహించారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ, బెల్లంపల్లి ఏసీపీ సూచనలతో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాండూర్ సీఐ దేవయ్య మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను చట్ట నిబంధనలకు లోబడి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటల పర్యవేక్షణ కోసం బాధ్యతాయుతమైన వాలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి అనుమతి లేదని, ప్రభుత్వ, న్యాయస్థానాల నిబంధనలకు అనుగుణంగా పరిమిత శబ్దంతో మాత్రమే మైక్ సెట్లు వినియోగించాలని తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ వైరింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ల కోసం విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ఘర్షణలు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో పుకార్లు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో తాండూర్ ఎస్ఐ ప్రసాద్, మాదారం ఎస్ఐ సౌజన్య, పోలీస్ సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## వానొస్తే... వరదే

- ఇక్కట్లు పడుతున్న ప్రజలు

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ , ప్రజా తీర్పు ఎల్లారెడ్డిపేట) సెప్టెంబర్ 13**

వానొస్తే చాలు ఆ రహదారి అంతా వరద నీరుతో నిండి వాహనదారులను, పాదచారులను ముప్పు తిప్పలు పెడుతుంది. వివరాల్లోకి వెళితే.... ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి–బొప్పాపూర్ గ్రామాలకు ఆనుకుని ఉన్న గొల్లపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి వర్షం పడితే భారీగా నీరు చేరడంతో వ్యాపారస్తులతో పాటు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో కాలం నుంచి దీనిని బాగు చేయించాలని సంబంధిత ఆర్ అండ్ బి అధికారులకు మొరపెట్టుకున్న అధికారులు స్పందించడం లేదు. వర్షం వస్తే భారీగా నీరు చేరి ఓ కుంటను తలపిస్తుంది, దీంతో ఆ రహదారి మంచి వెళ్లాలంటేనే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చర్యలు తాత్కాలికంగా చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య కనబడుతున్న ఎవరూ పట్టించుకోలేకపోవడంతో అధికారులపై విమర్శలు అయ్యాయి. సర్పంచ్ రమేష్ ప్రత్యేక చొరవతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో పలువురు అభినందించారు.



## షాపూర్ నగర్‌లో ధనుషదేశీత్ కా గణేష్ ఘన స్వాగతం

**షాపూర్ నగర్: సెప్టెంబర్ 13 ప్రజా తీర్పు**

షాపూర్ నగర్‌లో ధనుషదేశీత్ కా గణేష్ స్వాగతం, ఆగమనం కార్యక్రమం రాంబాటి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గణనాథుడిని పొలిమేరల నుంచి ఘనంగా స్వాగతిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు చప్పుట్లు, ఒగ్గుడోలు, బోనాలు, డీజే సంగీతం మధ్య భక్తుల ఉత్సాహం అంబరాన్ని తాకింది. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. మార్వాడీల సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు, నృత్యాలతో షాపూర్ మార్కెట్ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాంబాటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. గణనాథుడి ఆగమనాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో షాపూర్ మార్కెట్ మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా రాంబాటి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి గణేష్ ఉత్సవాలకు ప్రత్యేకత ఉండటంతో గణనాథుడిని మరింత ఘనంగా ఆహ్వానించి ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను రాంబాటి విశాలాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన షాపూర్ మార్కెట్ వాసులకు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన మున్సిపల్ సిబ్బంది, సంబంధిత సిబ్బంది, పోలీసు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాపూర్ మార్కెట్ వాసులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘన స్వాగతం పలికారు.

## కోరుట్లలో ఘనంగా తైక్వాండో కలర్ బెల్ట్ అప్‌గ్రేడింగ్ పరీక్ష

**కోరుట్ల సెప్టెంబర్ 13 (ప్రజాతీర్పు)**



కోరుట్ల పట్టణంలోని శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో మాస్టర్ నవనంది రమేష్ తైక్వాండో క్లబ్ -- మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ ఆధ్వర్యంలో తైక్వాండో కలర్ బెల్ట్ అప్‌గ్రేడింగ్ పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలో పలువురు తైక్వాండో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమతో శిక్షణ పొందుతున్న క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు. పరీక్షలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింత కృషి చేసి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ప్రవీణ్ శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ సహకారం అందించారు. చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ జి. సంతోష్ పరీక్షను నిర్వహించగా, కో–తైక్వాండో కోచ్ మాస్టర్ పి. రాజేందర్ సహకరించారు. పరీక్ష విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మాస్టర్ తైక్వాండో క్లబ్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైస్ మిల్లర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఇండస్ట్రీపై ఆధారపడ్డ కార్మికులను ఆదుకోవాలి.. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

**కరీంనగర్, సెప్టెంబర్ 13 ప్రజా తీర్పు**



రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రైస్ మిల్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో తగినంత నిల్వ సామర్థ్యం కల్పించి, రా రైస్, సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో లిఫ్టింగ్ చేయాలని కోరారు. ప్రతి క్రాప్‌కు సీఎంఆర్ బియ్యం స్వీకరణకు స్పష్టమైన గడువు, ప్రణాళిక ప్రకటించాలని, ధాన్యం కేటాయింపుల్లో ఎలాంటి వివక్ష లేకుండా మిల్లింగ్, నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా కేటాయింపులు చేయాలని అన్నారు. గడువులోగా 100 శాతం బియ్యం అందించే మిల్లర్లపై ఒత్తిడి చేయకుండా, కేసులు నమోదు చేయకుండా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధాన్యం కేటాయింపులు, సీఎంఆర్ లెక్కల్లో పారదర్శకత పాటించాలని, 10 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా మిల్లింగ్ చార్జీలు పెంచాలని, ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.10 చార్జీ ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ, వడ్డీ భారాన్ని మాఫీ చేయాలని కోరారు. పచ్చి ధాన్యాన్ని నెలల తరబడి నిల్వ ఉంచి మిల్లింగ్ చేయడం వల్ల నూకలు, పరం, రంగు మారడం, డ్యామేజీ వంటి సమస్యలతో ఏర్పడే నష్టాన్ని పూర్తిగా మిల్లర్లపైనే మోపడం అన్యాయమని వాసుదేవ రెడ్డి అన్నారు. సీఎంఆర్ బియ్యం విషయంలో అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అయితే తప్పు చేసిన ఒకరిద్దరి కారణంగా మొత్తం మిల్లర్లను అవినీతిపరులుగా చూడొద్దని సూచించారు. రైస్ మిల్ పరిశ్రమ దెబ్బతింటే మిల్లర్లు, రైతులు మాత్రమే కాకుండా డ్రైవర్లు, దినసరి కూలీలు, గుమస్తాలు, హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు తదితర వేలాది మంది ఉపాధిపై ప్రభావం పడుతుందని తెలిపారు. పరిశ్రమ మూతపడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి, సంబంధిత అధికారులు వెంటనే రైస్ మిల్లర్లతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. మిల్లర్లు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడుగా కొండ రమేష్

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ, ఎల్లారెడ్డిపేట ప్రజా తీర్పు) సెప్టెంబర్ 13**



రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా కొండ రమేష్ గౌడ్ ను నియమిస్తూ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు సిహెచ్ వెంకటేష్ యాదవ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపెల్లి చెందిన సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మండల సర్పంచులు అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సర్పంచ్ లసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు .

# భాస్కర్‌కు స్వర్ణ నంది పురస్కారం

**జమ్మికుంట సెప్టెంబర్ 13 ప్రజాతీర్పు**



ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువందనం, ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళలు, సాహిత్యం, సంస్కృతి, సేవా రంగాల్లో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సముద్రాల వేణుగోపాలచారి హాజరై పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులను గౌరవిస్తూ గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో రైతులకు సేవలందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, రైతులకు మార్గదర్శకత్వం అందిస్తున్న రైతు సంఘ నాయకుడు, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ సేవలను గుర్తించి స్వర్ణ నంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా హింగే భాస్కర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు విశేష సేవలందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న హింగే భాస్కర్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించడం పట్ల పలువురు ప్రముఖులు, రైతు సంఘాల నాయకులు, అభిమానులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హింగే భాస్కర్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి స్వర్ణ నంది పురస్కారంతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లో రైతులు, సమాజం కోసం తన వంతు సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు. కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, సాహిత్య, సేవా కార్యక్రమాలను వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు. తనకు స్వర్ణ నంది పురస్కారం అందజేసి ఆత్మీయంగా సత్కరించిన కళానిలయం సాంస్కృతిక సంఘ సంస్థ నిర్వాహకులు, ఏ. సురేందర్ కు హింగే భాస్కర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, కళానిలయం సభ్యులు, ఉపాధ్యాయులు, కళాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పందుల అడ్డాగా పశు వైద్యశాల







- వాటి స్వైర విహారంతో వరి నారు చెల్లాచెదురు.. ఓ రైతుకు నష్టం
- కోరపల్లి ప్రభుత్వ పశు వైద్యశాలలో పందుల నివాసమేల?
- జనం ఆగ్రహం

**జమ్మికుంట సెప్టెంబర్ 13 ప్రజాతీర్పు**

జమ్మికుంట మండల పరిధిలోని కోరపల్లి గ్రామ "గ్రామీణ పశు వైద్యశాల" పందులకు అడ్డాగా మారింది. గ్రామం లోని పశువులకు వైద్యం , పాడి పశువుల రక్షణ నిమిత్తం ప్రభుత్వం గ్రామీణ పశు వైద్యశాల పేరిట ఆఫీసును 1973లో నిర్మించింది. అప్పట్లో దానిని జిల్లా పశు వైద్య శాఖ అధికారి ప్రారంభించారు. పాడి సస్యరక్షణ లక్ష్యంగా ఈ పశు వైద్యశాలలో సేవలందించాలని భావించారు. కానీ, కొందరు దానిని పందులకు అడ్డాగా మార్చి.. ఏకంగా ఆఫీసు లోపల వరిగడ్డినీ పెట్టి.. తమ సొంత పాకలాగా మార్చుకొని పందులను అక్కడే నివాసంగా మార్చడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసు లోపల పందులను పెట్టి బయట తాళాలు సైతం వేస్తూ ఉండటం గమనార్హం. ముఖ్యంగా రైతులు తమ పశువులు ఇతర వైద్యం నిమిత్తం పశు వైద్యశాలకు వస్తే.. ఆ విభాగ వైద్య శాఖ వారు డాక్టర్లు, సిబ్బంది అక్కడ సేవలందించేందుకు వీలుగా ఉంటుంది. కొందరి నిర్వాకంతో ప్రస్తుతం కోరపల్లి గ్రామీణ పశు వైద్యశాల ఓ రకంగా పందుల నివాస అడ్డాగా మారడం పట్ల తీవ్రమైన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సదరు వ్యక్తుల తీరు సరికాదని, పందులను ప్రభుత్వ గ్రామీణ పశు వైద్యశాల ఆవరణలో పెట్టడం సమంజసం కాదని, వారిపైన తగు చర్యలు ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. పందుల స్వైర విహారంతో తాజాగా ఓ రైతు తన పొలం వద్ద వేసిన వరినారు చెల్లాచెదురు అయింది. సదరు రైతుకు నష్టం చేకూరడమే కాకుండా.. పందుల విచ్చలవిడి స్వైర విహారంతో కొంత ఇబ్బంది జరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనంగా ఉన్న పశువైద్యశాలను తమ పాకలాగా మార్చుకోవడం అంటే తమ ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరించడమేనని, సదరు వ్యక్తులపై గ్రామ పాలకవర్గం తగు రీతిలో చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

## డా. ఎం. రాజా కు ప్రతిష్టాత్మక "బెస్ట్ డాక్టర్ ఆఫ్ ది ఇయర్ 2026" అవార్డు

**ములుగు , సెప్టెంబర్ 13 (ప్రజా తీర్పు ప్రతినిధి వెంకట్ ):**

ప్రముఖ మీడియా సంస్థలు హెచ్ఎంటీవీ, ది హాన్స్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక హెల్త్‌కేర్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ప్రముఖ శిశు వైద్య నిపుణులు డా. ఎం. రాజా "బెస్ట్ డాక్టర్ ఆఫ్ ది ఇయర్ 2026" అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులను ఘనంగా సత్కరించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, నవజాత శిశువుల వైద్యం, అత్యవసర శిశు వైద్య సేవలలో డా. రాజా చూపిస్తున్న అంకితభావం, అత్యాధునిక వైద్య విధానాలతో వేలాది చిన్నారుల ప్రాణాలను నిలబెడుతున్న తీరు, నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్ డైరెక్టర్ డా. రవీందర్ నాయక్, నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు డా. తాడూరి గంగాధర్ చేతుల మీదుగా డా. ఎం. రాజా స్వీకరించారు. ఈ సందర్భంగా డా. రాజా మాట్లాడుతూ, తనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసిన హెచ్ఎంటీవీ ది హాన్స్ ఇండియా యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని, ఇది తనకు ఎంతో స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో కూడా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం, సమాజ శ్రేయస్సు కోసం మరింత నిబద్ధతతో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. డా. రాజా కి బెస్ట్ డాక్టర్ ఆఫ్ ది ఇయర్ 2026 అవార్డు రావడం పట్ల పలువురు ప్రముఖ వైద్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## నిత్యాశ్రీ కి జీవన్ రెడ్డి ప్రశంస...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) సెప్టెంబర్ 13.**



శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ హైదరాబాద్ వారు కళాభారతి కరీంనగర్ లో నిర్వహించిన జిల్లా స్థాయి కూచిపూడి నాట్యపోటీలలో జగిత్యాలకు చెందిన నాట్యాగురువు శ్రీమతి గుండి యమున శ్రీ శారదా సిద్దిరామ నాట్యాలయం నుండి చిన్నారి మహాదేవుని నిత్యాశ్రీ జిల్లా స్థాయిలో నాట్యప్రదర్శనలో ద్వితీయ బహుమతి గెలుపొందిన సందర్భంగా ఆ అవార్డును మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి నిత్యాశ్రీ ప్రతిభను అభినందించి భవిషత్తులో మరిన్ని ప్రతిభా పాటవాలను ప్రదర్శించి జిల్లా కు, తల్లిదండ్రులకు పేరు తేవాలని కొనియాడారు.

## జమ్మికుంటలో 'వాత్సల్య పిల్లల, స్త్రీల వైద్యశాల' ప్రారంభం

- ఒకే చోట తల్లి-బిడ్డలకు అత్యాధునిక వైద్య సేవలు రావడం అభినందనీయం: మున్సిపల్ చైర్మన్
- గత కొన్ని ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న డాక్టర్ దేవేందర్ రెడ్డి

**జమ్మికుంట, సెప్టెంబరు 13 ప్రజాతీర్పు (వంశీకృష్ణ)**



జమ్మికుంట పట్టణ పరిధిలోని బొమ్మల గుడి (శివాలయం) ఎదురుగా నూతనంగా నిర్మించిన 'వాత్సల్య పిల్లల, స్త్రీల వైద్యశాల' అత్యాధునిక భవనాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... జమ్మికుంట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషక రమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దేవేందర్ రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు నిరంతరం విశ్వసనీయమైన వైద్య సేవలు అందిస్తూ వారి నమ్మకాన్ని గెలుచుకున్నారని కొనియాడారు. ప్రస్తుతం మారుతున్న వైద్య రంగ సాంకేతికతకు అనుగుణంగా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ నూతన భవనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చిన్న పిల్లలు అనారోగ్యానికి గురైనప్పుడు లేదా స్త్రీల సంబంధిత వైద్య సేవల కోసం జిల్లా స్థాయి ఆసుపత్రులకు, సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మన జమ్మికుంటలోనే ఒకే చోట తల్లి, బిడ్డకు కావలసిన సమగ్ర వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం స్థానిక ప్రజల అదృష్టమని ఆయన తెలిపారు. ఇక్కడ గైనకాలజిస్ట్ (స్త్రీల వైద్య నిపుణుల) సేవలు కూడా అందుబాటులో ఉండటం గర్భిణులకు, మహిళలకు ఎంతో ఊరట కలిగిస్తుందని అన్నారు. ప్రజాదరణ పొందిన డాక్టర్ దేవేందర్ రెడ్డికి, ఆసుపత్రి సిబ్బందికి ఆయన తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, ముఖ్య నాయకులు ఇంద్రసేనారెడ్డి, పలువురు ప్రముఖ వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని డాక్టర్ దేవేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## భక్తితో మట్టి గణపతి బాధ్యతతో పర్యావరణ పరిరక్షణ

- 17వ ఏడాది అభినవ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ
- రెండు రోజుల్లో 1,267 విగ్రహాల పంపిణీ మొక్కల పంపిణీతో పర్యావరణ సందేశం

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) సెప్టెంబర్ 13**



తాండూర్ : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావిస్తూ పర్యావరణహిత మట్టి గణపతులను ప్రోత్సహించాలనే సంకల్పంతో అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ 17వ ఏడాది కూడా సేవా కార్యక్రమాన్ని కొనసాగించింది. తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ సెంటర్‌లో ఆదివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కేశెట్టి సంతోష్‌కుమార్ (అభినవ) ఆధ్వర్యంలో మట్టి గణపతులు, మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాదరావు, మాదారం ఎస్సై సౌజన్య ముఖ్య అతిథులుగా హాజరై మట్టి గణపతి విగ్రహాలు, మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు సందేశాన్ని ఇచ్చేలా ఉండాలని సూచించారు. మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా సంప్రదాయాన్ని కాపాడటంతో పాటు ప్రకృతిని పరిరక్షించినట్లవుతుందని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అని పేర్కొంటూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. రెండు రోజుల్లో 1,267 మట్టి గణపతులు అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 666 మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. వినాయక చవితి రోజైన సోమవారం మరో 601 విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో రెండు రోజుల్లో మొత్తం 1,267 పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు అందించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణలో భాగంగా రణపాల మొక్కలను పంపిణీ చేశారు. మట్టి గణపతిని ఇంటికి తీసుకెళ్లే ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు.

### 17 ఏళ్లుగా పర్యావరణ సేవ

సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. అభినవ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. దాతల సహాయ సహకారాలతో గత 17 సంవత్సరాలుగా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఒక్క సంస్థ బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వినాయక చవితి సందర్భంగా భక్తితో గణపతిని పూజించడంతో పాటు ప్రకృతిని కాపాడాలనే ఆలోచనను ప్రజల్లో పెంపొందించడమే తమ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతి, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి 17 ఏళ్లుగా సహకరిస్తున్న దాతలు, శ్రేయోభిలాషులు, వాసవి వనిత సభ్యులు, అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, స్థానిక ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "భక్తి మన సంప్రదాయం.. మట్టి గణపతి మన బాధ్యత.. మొక్క మన భవిష్యత్తు" అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని డా. అభినవ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత సభ్యులు కేశెట్టి సువర్ణ, మైలారపు అక్షయ, కాసం సునీత, బోనగిరి హేమలత, గాదె శ్రీ విజయలక్ష్మి, తణుకు శంకరమ్మ, కోడిప్యాక మాధురి, తనకు సువర్ణ, జైన పద్మ, సామ కల్పన, గంజి శ్రీరాధిక, బోనగిరి స్పందనతో పాటు అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సామ రమేష్, మైలారపు మధుసూదన్, గాదె కుమార్, చంద్రశేఖర్, సురేష్, సంతోష్, మహేష్, నవీన్, రాజన్న, సోషల్ వర్కర్ హబీబ్, దాతలు, శ్రేయోభిలాషులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఖో-ఖోలో శ్రీనిధి గ్లోబల్ స్కూల్ సత్తా!

- కుత్బుల్లాపూర్ జోనల్ స్థాయి అండర్-14 పోటీల్లో ద్వితీయ స్థానం
- సుమారు 40 జట్ల మధ్య హోరాహోరీ పోరు.. విద్యార్థుల ప్రతిభకు అభినందనలు

**హైదరాబాద్,, సెప్టెంబర్ 13 (ప్రజా తీర్పు)**

కుత్బుల్లాపూర్ జోనల్ స్థాయి అండర్-14 ఖో-ఖో పోటీల్లో శ్రీనిధి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సుమారు 40 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిన శ్రీనిధి గ్లోబల్ స్కూల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటింది. బాచుపల్లి సమీపంలోని సూర్య గ్లోబల్ స్కూల్ వేదికగా నిర్వహించిన ఈ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రతి మ్యాచ్‌లోనూ విద్యార్థులు సమన్వయం, వేగం, క్రమశిక్షణతో ఆడి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. చివరి వరకు పట్టుదలతో పోరాడి రన్నర్స్‌అప్‌గా నిలిచారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంపై శ్రీనిధి గ్లోబల్ స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పాఠశాల చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ కోమలాదేవి విజేత విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ శిక్షణ అందిస్తున్న కోచ్ శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించి, ఆయన మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు. కోచ్ శ్రీకాంత్ పర్యవేక్షణలో విద్యార్థులు క్రమశిక్షణతో, నిరంతర సాధనతో పోటీలకు సిద్ధమయ్యారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల కృషి, జట్టు సమన్వయం, పట్టుదలే ఈ విజయానికి కారణమని తెలిపింది. విద్యార్థులతో పాటు కోచ్ శ్రీకాంత్‌ను ఉపాధ్యాయులు కూడా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని యాజమాన్యం ఆకాంక్షించింది.



## పర్యావరణ పరిరక్షణకు అలయన్స్ డిస్ట్రిక్ట్ 137ఏ కృషి

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) సెప్టెంబర్ 13**

అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137ఏ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ సంవత్సరం కూడా సుమారు 70 మందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు, నేల, పర్యావరణానికి కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. పర్యావరణహితమైన మట్టి వినాయకులను ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని, పూజ అనంతరం మట్టి తిరిగి మట్టిలో కలిసిపోయే విధంగా ఉండటం మట్టి వినాయకుల ప్రత్యేకత అని తెలిపారు. డిస్ట్రిక్ట్ 137ఏ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గతంలో గ్రీన్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు, 1,200 మొక్కల నాటడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. మట్టి వినాయకుల పంపిణీ కూడా పర్యావరణహిత పండుగల నిర్వహణకు ప్రజల్లో అవగాహన కల్పించే మరో ముఖ్యమైన కార్యక్రమమని పేర్కొన్నారు. అలాగే, స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 1893లో మహారాష్ట్రలో సార్వజనిక గణపతి ఉత్సవాలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారని వివరించారు. అనంతరం ఈ సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తుల రమణాచారి డాక్టర్ జీఎం కిరణ్ డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ అశోక్ డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ సౌమ్య డాక్టర్ సాయి మేఘన డాక్టర్ సాయి ప్రీతం తదితరులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేసి పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ శ్రీనివాస్ ఇంజనీర్ కోల అన్నా రెడ్డి జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్ టివి రావు బండిపల్లి వెంకటరమణ హుజురాబాద్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ మనోజ్ ప్రసాద్ సాగర్ రెడ్డి పులాల శామ్ నాగేశ్వర్ కుమారస్వామి వెంకన్న వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



## చుక్కమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రమీల...

**కురవి సెప్టెంబర్ 13(ప్రజా తీర్పు విలేఖరి)**

అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కామ సంజీవ మాతృమూర్తి స్వర్గీయ కామ చుక్కమ్మ దశ దిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల హాజరై చుక్కమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కామ సంజీవ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్,సీరోలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుడిగే లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, దళిత రత్న దైద భద్రయ్య, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ బాధ్యత మన అందరిదీ

- ప్రకృతి ని మనం ప్రేమిస్తే... మనల్ని ప్రకృతి కరుణిస్తుంది...

**సిద్దిపేట, సెప్టెంబర్ 13 (ప్రజా తీర్పు)**



విగ్నేశ్వరుడు దేవుడే కాకుండా ప్రజలందరికీ మార్గదర్శకుడని మాజీమంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు గారు అన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట పట్టణంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినాయక విగ్రహాన్ని ఎంత పెద్దగా పెట్టామన్నది ముఖ్యం కాదని ఎంత భక్తిశ్రద్ధలతో పూజించామన్నదే ముఖ్యమన్నారు. ఊరికి ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజించాలని తాను గతంలో చెప్పానని గుర్తు చేశారు. ఏ గ్రామంలోనైనా, వార్డులోనైనా ఒక్కటే ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే తాను పర్మినెంట్ షెడ్డు నిర్మించి ఇస్తానని పిలుపునిచ్చారు... రసాయనలతో కూడిన వినాయకులను చెరువులో నిమజ్జనం చేయడంతో నీళ్లలో ఉండే జీవరాశులు చనిపోవడంతో పాటు భూమి కలుషితమై ప్రజా ఆరోగ్యానికి కీడు చేసే క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు... వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు ఉన్నాయి.ఆయన పెద్ద తల గొప్పగా ఆలోచించమని చెబుతుంది... పెద్ద చెవులు ప్రజల మాట వినాలని చెబుతాయి... చిన్న కళ్ళు లక్ష్యంపై దృష్టి పెట్టాలని చెబుతాయి. ఆయన తొండం. పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాలని నేర్పుతుంది. అందుకే గణపతి కేవలం పూజించే దేవుడు మాత్రమే కాదు... మన జీవితానికి మార్గదర్శకుడన్నారు..ప్రకృతిని ప్రేమించి, పుష్పాలను ప్రేమించే గొప్ప సముష్కృతి మన తెలంగాణ వారిదన్నారు. దక్షిణ భారతదేశంలోనే అమర్నాథ్ అన్నా సేవ సమితి ప్రసిద్ధిగాంచిందన్నారు.అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 16 సంవత్సరాలుగా మంచు కొండల్లో సేవలందించడం గొప్ప విషయమన్నారు. అలాగే ప్రకృతిని ప్రేమిస్తూ 16 సంవత్సరాలుగా సిద్దిపేటలో ప్రతి సంవత్సరం పదివేల మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మనం ఏ కార్యక్రమం చేపట్టిన ముందు విఘ్నేశ్వరుని పూజించే చేపడుతామని ఆ విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నానారు.

# నెక్కొండలో మట్టి విగ్రహాల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు బీజేవైఎం పిలుపు

**నెక్కొండ, సెప్టెంబర్ 13, ప్రజా తీర్పు ప్రతినిధి:**



బీజేవైఎం వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ లిఖిత్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్కొండ హైస్కూల్ సెంటర్‌లో ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగోల భారత్ వీర్ హాజరయ్యారు వారితోపాటు నెక్కొండ మండల అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు, గురుస్వామి, బీజేపీ నాయకులు శ్రీరంగం సంపత్ గారు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లిఖిత్ గౌడ్ మాట్లాడుతూ మన సంప్రదాయాన్ని కాపాడుతూనే మన ప్రకృతిని కూడా కాపాడుకోవాలి. మట్టి విగ్రహాల వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి పరిరక్షణ కోసం బీజేపీ--బీజేవైఎం యువత ఎప్పుడూ ముందుంటుంది. ఈ ఉద్యమం మరింత విస్తరించేలా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంబాల రాంగోపాల్, అశోక్, రాజగోపాల్, అనిల్, సందీప్ తో పాటు స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మట్టి విగ్రహాల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు బీజేవైఎం పిలుపు**

బీజేవైఎం వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ లిఖిత్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్కొండ హైస్కూల్ సెంటర్‌లో ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగోల భారత్ వీర్ హాజరయ్యారు వారితోపాటు నెక్కొండ మండల అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు, గురుస్వామి, బీజేపీ నాయకులు శ్రీరంగం సంపత్ గారు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లిఖిత్ గౌడ్ మాట్లాడుతూ మన సంప్రదాయాన్ని కాపాడుతూనే మన ప్రకృతిని కూడా కాపాడుకోవాలి. మట్టి విగ్రహాల వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి పరిరక్షణ కోసం బీజేపీ--బీజేవైఎం యువత ఎప్పుడూ ముందుంటుంది. ఈ ఉద్యమం మరింత విస్తరించేలా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంబాల రాంగోపాల్, అశోక్, రాజగోపాల్, అనిల్, సందీప్ తో పాటు స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడే ముద్దు

**మేడిపల్లి, సెప్టెంబర్ 13. ( ప్రజాతీర్పు )**



మేడిపల్లి:బోడుప్పల్ సర్కిల్లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎఫ్ టి పి న్యూస్ తెలంగాణ స్టేట్ చీఫ్ కొచ్చర్ల రవితేజ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పి ఓ పి ) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలనే సందేశంతో ప్రజలకు 70 మట్టి గణేష్ విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. వినాయక చవితి భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ మాత్రమే కాకుండా, మన పర్యావరణాన్ని కూడా కాపాడుకునే బాధ్యతను గుర్తుచేసే సందర్భమని అన్నారు.మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, చెరువులు, నీటి వనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు."పండుగను ఘనంగా జరుపుకుందాం.. అదే సమయంలో ప్రకృతిని కూడా పరిరక్షిద్దాం" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రజలు కూడా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి, పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని ఎఫ్ టి పి న్యూస్ తెలంగాణ స్టేట్ చీఫ్ కొచ్చర్ల రవితేజ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా.. భక్తితో పాటు బాధ్యతను చాటుతూ సాగిన ఈ కార్యక్రమం స్థానికంగా ఆకట్టుకుంది.



# పాలిటెక్నిక్ కళాశాలకు కంప్యూటర్ సైన్స్ విభాగం మంజూరు చేయాలి

**మంత్రి వివేక్ వెంకటస్వామికి జువ్వాడి కృష్ణారావు విజ్ఞప్తి**

**కోరుట్ల, సెప్టెంబర్ 13 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కోరారు.ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. కోరుట్ల ప్రాంత విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ విద్య అందుబాటులోకి వస్తే ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. దీనిపై మంత్రి వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



## నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయం కోసం పని చేస్తా

**నర్సంపేట సెప్టెంబర్ 13 ప్రజా తీర్పు ప్రతినిధి**

నల్లబెల్లి మండలాన్ని నర్సంపేట నియోజకవర్గన్నీ రాష్ట్రస్థాయిలో అభివృద్ధి చేసిన మాజీఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అభివృద్ధి బాటలో నడుస్త. బిఆర్ఎస్ పార్టీ నాయకుడిగా ప్రజాసేవలో కొనసాగుతా.. మామిళ్ల మోహన్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. నిన్నటి రోజున జరిగిన కొన్ని అనివార్య కారణాలవల్ల నా యొక్క పార్టీ మార్పు పైన ప్రచారం జరిగింది కానీ నేను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి మరియు పిఏసిఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ మరియు మండల నాయకుల, గ్రామా నాయకుల సమిష్టి ప్రోత్సాహంతో నల్లబెల్లి మండల ప్రజలకు క్లస్టర్ బాధ్యునిగా నేను మరింత ముందుకెళ్లి మండల ప్రజలకు సేవ చేస్తాను. భవిష్యత్తులో కెసిఆర్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుంది కార్యకర్తలు నాయకులు అందరూ కలిసికట్టుగా రానున్న ఎన్నికలను ఎదుర్కొని నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తాశీ ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు గోనె యువ రాజు , గ్రామ పార్టీ అధ్యక్షులు గోటుకుల బుచ్చి రెడ్డి,మాజీ ఎంపీటీసీ సపావత్ దేవ్ నాయక్,మాజీ సర్పంచ్ ఊరటి అమరేందర్,పార్టీ సీనియర్ నాయకులు పెంతల సాంబ రెడ్డి, వార్డు మెంబెర్స్ పెంతల ప్రమోద్,పొన్నాల ఇందిర, మాజీ వార్డు మెంబర్ యార రవి, ఏడాకుల శంకర్,పొన్నాల బుచ్చి రెడ్డి, పెంతల శ్రీనివాస్, ఊరటి రాంరెడ్డి, బాబు తో పాటు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ దేవేందర్‌కు చైనాలో ఉత్తమ విదేశీ బోధకుడి అవార్డు

- హర్షం వ్యక్తం చేసిన కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్

**హుస్నాబాద్ సెప్టెంబర్ 13 రవీందర్ ప్రజా తీర్పు**



చిన్ననాటి మిత్రుడు హుస్నాబాద్ కు చెందిన డాక్టర్ దేవేందర్ కు చైనాలో ఉత్తమ విదేశీ బోధకుడి అవార్డు రావడం పట్ల ఆదివారం పట్టణ 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణ సుభాష్ నగర్ కు చెందిన పొన్నం మల్లయ్య, భాగ్యమ్మ ల కుమారుడు దేవేందర్ వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుండి ఉన్నత స్థాయికి ఎదగడం సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యున్నాన్ మిన్జు యూనివర్సిటీ కున్మింగ్‌లో 2024 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హుస్నాబాద్ మండలానికి చెందిన డా. పొన్నం దేవేందర్ అంతర్జాతీయ గుర్తింపు పొందారని, 2025--26 విద్యా సంవత్సరానికి యూనివర్సిటీ ఆయనను 'ఎక్సలెంట్ అండ్ అవుట్‌స్టాండింగ్ ఫారిన్ టీచర్' (ఉత్తమ విదేశీ బోధకుడు)గా ఎంపిక చేసిందని తెలిపారు. యూనివర్సిటీ ఆయనకు 8 వేల చైనీస్ యువాన్లు భారత కరెన్సీలో సుమారు రూ. 1.2 లక్షలు నగదు బహుమతిని ప్రదానం చేసిందన్నారు. పరిశోధనల్లో కీలక కృషి చేయడంతోపాటు భారత్--చైనా విద్యా, పరిశోధన సంబంధాలను బలోపేతం చేసినందుకు ఈ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. దేవేందర్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేశారని, ఫోటోకెమిస్ట్రీ, ఆర్గనోకెటాలిసిస్. ప్రస్తుతం ప్రొఫెసర్ ఫాన్ బాఒమిన్ బృందంలో సభ్యుడిగా పనిచేస్తున్నారన్నారు. ఇంతకుముందు 2016--18లో చైనాలోని వుహాన్‌లో పోస్ట్‌డాక్టోరల్ పరిశోధన చేశారని, 2019--23 మధ్య భారత్‌లోని అరాగెన్ లైఫ్ సైన్సెస్, హానర్ ల్యాబ్స్ సంస్థల్లో టీమ్ లీడర్‌గా పనిచేశారన్నారు. దేవేందర్ తన సాధనతో గ్రామానికి, ప్రాంతానికి గుర్తింపు తెచ్చారన్నారు.



# సార్ ధ్రువీకరణ పత్రాలు నల్లబెల్లి ఎమ్మార్వో కు అందజేసిన 2వ వార్డు మెంబర్ అడ్డ శ్రీదేవి

**నర్సంపేట సెప్టెంబర్ 13 ప్రజాతీర్పు ప్రతినిధి**

నల్లబెల్లి మండల, నందిగామ గ్రామపంచాయతీ కార్యాలయంలో నందిగామ 2వ వార్డు మెంబర్ అడ్డ శ్రీదేవి తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అధికారులకు అందజేసి, అవసరమైన సరైన వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా నందిగామ గ్రామంలో నోటీసులు అందుకున్న వారందరూ ఆలస్యం చేయకుండా తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి, అధికారులు కోరిన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా సంబంధిత ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమ వివరాలు సరిగ్గా నమోదు అయ్యేలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో =× కృష్ణస్వామి, జి పి ఓ రాకేష్, ఉప సర్పంచ్ మేడిపల్లి శంకరయ్య, బి ఎల్ ఓ రాజ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**హుస్నాబాద్ సెప్టెంబర్ 13 రవీందర్ ప్రజాతీర్పు**



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించిన వారమవుతామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి, శాంతి, సోదరభావంతో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని మంత్రి సూచించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి వెల్లివిరియాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు.

# చెన్నరావుపేటలో జనతా ట్రస్ట్ వారి 3వ ఉచిత కంటి వైద్య శిబిరం

- పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం – జనతా ట్రస్ట్ చైర్మన్ డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట సెప్టెంబర్ 13 ప్రజా తీర్పు ప్రతినిధి**



చెన్నరావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో శంకర కంటి ఆసుపత్రి మరియు జనతా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 3వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ కంది గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరానికి చెన్నరావుపేట మండలం నుండి సుమారు 677 మందిలి ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో మొత్తం 677 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, అవసరమైన 412 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అలాగే తీవ్రమైన కంటి సమస్యలు, శుక్లాలు (క్యాటరాక్ట్) వంటి వ్యాధులతో బాధపడుతున్న 65 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి, జనతా ట్రస్ట్ మరియు శంకర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 65 మందిని గుర్తించి, జనతా ట్రస్ట్ మరియు శంకర్ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కంది గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ని మరియు వారి మిత్ర బృందాన్ని అభినందించారు, వారిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డా. రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ. “ఆర్థిక స్థోమత లేక వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలవడమే జనతా ట్రస్ట్ ప్రధాన లక్ష్యం. డబ్బు లేక ఏ ఒక్క పేదవాడు కూడా వైద్యానికి దూరం కాకూడదు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ వైద్య సహాయం అందించే వరకు మా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి.” అని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, రాబోయే రోజుల్లో ప్రతి మండలంలో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, విద్యా సహాయ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని, ప్రజా సేవలో ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. శిబిరాన్ని విజయవంతం చేసిన శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందానికి, జనతా ట్రస్ట్ సభ్యులకు, పెద్ద ఎత్తున హాజరైన ప్రజలకు డా. రాణా ప్రతాప్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల ఆరోగ్యమే ప్రథమ లక్ష్యంగా, సేవే సంకల్పంగా జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని ఉచిత వైద్య సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనతా ట్రస్ట్ బృందం మరియు చెన్నరావుపేట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ బగాయత్‌లో ఘనంగా ఆర్యవైశ్య భవన్ భూమి పూజా కార్యక్రమం

- ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణ సముదాయ భూమి పూజకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) సెప్టెంబర్,13:**

మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఉప్పల్ బగాయత్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆర్యవైశ్య భవన్ భూమి పూజా కార్యక్రమం జరిగింది. ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి, ఐక్యతకు ఈ భవన్ ఒక వేదికగా నిలవాలని ఆశిద్దాం. మాజీ మంత్రి టీజీ వెంకటేష్ ఆర్యవైశ్య సంఘం కి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, ఎల్బీనగర్ కాంటెస్ట్ ఎమ్మెల్యే మధు యాస్కి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ హౌసింగ్ చైర్మన్ కోలేటి దామోదర్, ఉప్పల్ ఎమ్మెల్యే, డీసీసీ మెడ్చల్ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మాజీ కార్పొరేటర్, రజిత పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ భవన నిర్మాణ కార్మిక చైర్మన్ ఫుడ్ సప్లై నిర్వాహకులు పల్లభట్ల ఆనంద భాస్కరరావు, నల్లమల శ్రీనివాసరావు, నల్లమల స్నేహ లత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లోక్ ఆదాలత్ నందు 4475 కేసులు పరిష్కారం

- సైబర్ నేరాలకు సంభందించి 31 కేసుల్లో 46.81 లక్షల నగదు బాధితుల ఖాతాలో జమ
- జిల్లా ఎస్పి కె.నరసింహ ఐపిఎస్,

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 13**

శనివారం రోజున జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా పోలీస్ పెండింగ్ లో ఉన్న కేసుల్లో 4475 కేసులను పరిష్కరించడం జరిగిందని సైబర్ మోసాలకు సంబంధించి 31 కేసుల్లో 46 లక్షల 81 వేల రూపాయలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 851 క్రిమినల్ కేసులు, 1688 ఈ-పెట్టీ కేసులు, 1936 డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగినది అన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించాం అన్నారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ శాఖ సిబ్బందిని అభినందిస్తున్నాను అని తెలిపారు.



## ఘట్కేసర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని పిలుపు


**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్) సెప్టెంబర్, 13:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఘట్కేసర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్కేసర్ బస్‌స్టాప్ వద్ద లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేసు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడిగా భక్తులచే ఆరాధించబడతాడని, గణేశుడి పూజతో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి, సులభంగా నీటిలో కలిసిపోయే మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా చెరువులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని తెలిపారు. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితమైన విధానంలో గణేష్ చవితి వేడుకలను నిర్వహించాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో చార్టర్డ్ లయన్ సారా శ్రీనివాస్ గౌడ్, మారం లక్ష్మారెడ్డి, బచ్చు నగేష్ గుప్తా, సగ్గు వేణుమాధవ్, లంబ సత్యనారాయణ, రామ్మోహన్, రాఘవేందర్, నర్సింగ్‌రావు, హిమబిందు, బోగ లక్ష్మి, మమత శర్మ, శంకర్‌రెడ్డి, ఆంజనేయులు, విక్రాంత్‌రెడ్డి, తాలూకా రాములు, అంజి తదితరులతో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో పూజలు నిర్వహించుకోవాలి

- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 13**



విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రజలందరికి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతతో పాటు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఇకనుండైనా విఘ్నాలన్నీ తొలగి తెలంగాణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఏక దంతుడి దీవెనలతో ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లి విరిసేలా గణపతి నవరాత్రోత్సవాలు జరుపు కోవాలని అయన విజ్ఞప్తి చేశారు. వాడవాడలా తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసిన మండపాలవద్ద తగుజాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

# 12 ఏళ్లుగా ఎదురుచూపులేనా...

- కళాకారులపై ప్రభుత్వం వివక్ష మానుకోవాలి..
- తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యమ కళాకారులకు తక్షణమే అవకాశం కల్పించాలి,
- సిద్దిపేట జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్

**సిద్దిపేట, సెప్టెంబర్ 13 (ప్రజా తీర్పు )**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ కళను ఆయుధంగా మార్చుకుని, పాటను పోరాటంగా మలిచి, తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధనకు కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళాకారులు నేడు ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులతో, కుటుంబాలను పోషించుకోలేక ఆత్మహత్యల పాలవుతూన్నారని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న,రాష్ట్ర చైర్మన్ అనువోజు వెంకటేశం,వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్ కుమార్ సూచన మేరకు ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇప్పటికే పన్నెండున్నర సంవత్సరాలు పూర్తయినా, తెలంగాణ కోసం తమ జీవితాలను, కళను, శ్రమను సమయాన్ని అంకితం చేసిన ఉద్యమ కళాకారుల జీవితాల్లో ఇప్పటివరకు ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. ఉద్యమంలో గ్రామం నుంచి పట్నం వరకు, గల్లి నుంచి ఢిల్లీ వరకు రాస్తారోకో,వంట వార్పు, సకల జనుల సమ్మె బహిరంగ సభల వరకు తెలంగాణ ఆకాంక్షను పాటల ద్వారా, డప్పుల ద్వారా, ధూంధాం ప్రదర్శనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారులు నేడు కనీసం తిండి లేని పరిస్థితులలో ఉపాధి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి రావడం తెలంగాణ ప్రభుత్వానికి మా పరిస్థితి కనరాకపోవడం చాలా బాధాకరమన్నారు. శాసనమండలిలో జరిగిన సమావేశాల్లో శాసనమండలి సభ్యురాలు విజయశాంతి తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యలను ప్రస్తావించి, ఉద్యమంలో పనిచేసిన కళాకారులు నేడు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను సంవత్సరం క్రితమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించడం పట్ల తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం హర్షం వ్యక్తం చేసిందన్నారు..అలాగే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వంటి ప్రజా నాయకులు తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యలను పెద్దల సభలో ప్రస్తావించడం అభినందనీయమన్నారు. ఉద్యమ కళాకారుల ఆవేదనను ప్రజా ప్రతినిధులు అర్థం చేసుకుని శాసనసభ, శాసనమండలి వేదికలపై వారి గొంతుకను వినిపించడం ద్వారా తమకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం కలుగుతుందని మాటలకే పరిమితం అయిపోతున్నాయి ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం చేసిన విధంగా కాలయాపన చేస్తుందేమో అన్న ఆలోచన కలుగుతున్నదని ఉద్యమ కళాకారుల సంఘం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రభుత్వం వస్తే తప్పకుండా ఉద్యోగాలు ఇస్తామని చెప్పినటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం లేకపోవడం, ఉద్యోగాల విషయంలో కాలయాపన కొనసాగడం ఉద్యమ కళాకారుల్లో తీవ్ర నిరాశకు కారణమవుతోందని అన్నారు."తెలంగాణ కోసం మా పాటలు అవసరమైనప్పుడు మమ్మల్ని గుర్తించారు. ఉద్యమం జరిగినప్పుడు మా కళ అవసరమైంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాత్రం మా జీవితాలు ఎందుకు గుర్తుకు రావడం లేదు?" అని ఉద్యమ కళాకారులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేదికలపై నిలబడి వేలాది సభల్లో ప్రజలను చైతన్యపరిచిన కళాకారులు, నేడు అదే తెలంగాణలో ఉపాధి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం దురదృష్టకరమని సంఘం ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ కళాకారులకు కేవలం ప్రశంసలు, సన్మానాలు, హామీలు మాత్రమే సరిపోవని అన్నారు. ఉద్యమంలో కళాకారులు చేసిన సేవకు ప్రభుత్వం ఇచ్చే నిజమైన గౌరవం వారికి గౌరవప్రదమైన తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించడమేనని పేర్కొన్నారు. ఉద్యమ కళాకారుల అర్హత, అనుభవం, ఉద్యమంలో వారి పాత్రను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ సాంస్కృతిక సారథిలో ప్రత్యేకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక అడుగు ముందుకు వేస్తే.. ఉద్యమ కళాకారుల జీవితాల్లో వెలుగు నింపే అవకాశం ఎక్కువగా ఉంది" అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నో సందర్భాల్లో హామీలు ఇచ్చిందని, కానీ ఆ హామీలు ఆచరణలోకి రాకపోవడంతో పన్నెండు సంవత్సరాలుగా నిరీక్షణ కొనసాగుతోందన్నారు. కాలయాపనకు కూడా ఒక హద్దు ఉంటుంది. ఉద్యమ కళాకారుల సహనానికి కూడా ఒక పరిమితి ఉంటుందని ఇకపై మాటలతో మభ్యపెట్టకుండా, స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, ఉద్యోగాల భర్తీకి ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమ కళాకారుల సమస్యలను పెద్దల సభలో ప్రస్తావించిన శాసనమండలి సభ్యురాలు విజయశాంతి కి, అలాగే తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యలను ప్రస్తావిస్తున్న పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఉద్యమ కళాకారుల కన్నీళ్లకు, వారి కుటుంబాల కష్టాలకు, వారి పన్నెండున్నర ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికేలా ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాము.తెలంగాణ కోసం పాడిన గొంతులకు.. తెలంగాణలోనే ఉద్యోగం కల్పించాలి.తెలంగాణ కోసం మోగిన డప్పులకు.. తెలంగాణలోనే గౌరవం దక్కాలి. తెలంగాణ కోసం నడిచిన కళాకారులకు.. తెలంగాణలోనే గౌరవప్రదమైన జీవితం కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో నిరుద్యోగ కళాకారుల రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు జిల్లా ఉపాధ్యక్షులు తునికి రాజు తదితరులు పాల్గొన్నారు.



## మధుయాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన తోటకూర వజ్రేష్ యాదవ్

- ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి)నూతన చైర్‌పర్సన్‌గా నియమితులైన మధుయాష్కీ గౌడ్‌ను అభినందించిన కాంగ్రెస్ నాయకులు

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) సెప్టెంబర్, 13 :**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ( ఏఐపిసి ) నూతన చైర్‌పర్సన్‌గా నియమితులైన మధుయాష్కీ గౌడ్‌ను మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీ పరమేశ్వర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ నయా భూపతి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ నివాసానికి వెళ్లిన నాయకులు, ఆయనకు అభినందనలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ విభాగం అభివృద్ధికి ఆయన నాయకత్వం మరింత దోహదపడాలని వారు పేర్కొన్నారు.



## నర్సంపేటలో ఘనంగా సేవాలాల్ సప్త కార్యక్రమం

- గోర్ సిక్వాడీ, గోర్ సేన ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

**నర్సంపేట సెప్టెంబర్ 13(ప్రజా తీర్పు)**

నర్సంపేట: గోర్ సిక్వాడీ, గోర్ సేన ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో ఉన్న సేవాలాల్ మహారాజ్ గుడి వద్ద సేవాలాల్ సప్త కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏడు రోజుల పాటు అబ్బాయిలు నిష్టతో సేవాలాల్ మహారాజ్‌ను పూజించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం భక్తిశ్రద్ధలతో భోగ్--బండారో కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గోర్ సిక్వాడీ, గోర్ సేన నాయకులు, సభ్యులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో గోర్ బంజారా సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ సేవాలాల్ సప్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. వేదిక: సేవాలాల్ మహారాజ్ గుడి, మాదన్నపేట రోడ్, నర్సంపేట.

# కోడి పందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్, కన్నెపల్లి పోలీసుల సంయుక్త దాడి

- ఆరుగురు వ్యక్తులు అదుపులోకి,
- రెండు కోళ్లు,రూ.2,100 నగదు స్వాధీనం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 13**

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో అందిన విశ్వసనీయ సమాచారంతో రామగుండం కమిషనరేట్ నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు రమేష్, లచ్చన్న, ఆర్ ఎస్ ఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, మంచిర్యాల జిల్లా కన్నెపల్లి ఎస్ ఐ విక్రమ్ పోలీసులతో కలిసి కన్నెపల్లి మండలం చింతపూడి లింగాల గ్రామశివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తూ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రెండు కోళ్లు రూ. 2,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.



**అదుపులోకి తీసుకున్న వ్యక్తుల వివరాలు**

1. రామ్‌టెంకి వినోద్,తండ్రి: రామ్‌చందర్, వయస్సు:25 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, చంద్రపల్లి గ్రామం, దహెగాం మండలం.
2. పాలే సుధాకర్, తండ్రి:శంకర్, వయస్సు:26 సంవత్సరాలు, వృత్తి: ఎలక్ట్రీషియన్, చిన్నరాసిపల్లి గ్రామం, దహెగాం మండలం.
3. సుదమల్ల రవి, తండ్రి: భీమయ్య, వయస్సు:26 సంవత్సరాలు, వృత్తి:ఆటో డ్రైవర్, పి.పి.రావుపల్లి గ్రామం, దహెగాం మండలం.
4. గట్లే పవన్, తండ్రి: మధునయ్య, వయస్సు:21 సంవత్సరాలు, వృత్తి: ట్రాక్టర్ డ్రైవర్, పి.పి.రావు కాలనీ, దహెగాం మండలం.
5. బోగే శేఖర్, తండ్రి: చిన్నయ్య, వయస్సు:32 సంవత్సరాలు, వృత్తి: ఆటో డ్రైవర్, మాదవెల్లి గ్రామం, కన్నెపల్లి మండలం.
6. పాలే అశోక్, తండ్రి: ఇస్తారి, వయస్సు:30 సంవత్సరాలు, వృత్తి: వ్యవ సాయం, చిన్నరాత్‌పల్లి గ్రామం, దహెగాం మండలం.

అదుపులోకి తీసుకున్న ఆరుగురు వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న సామగ్రి మరియు నగదుతో సహా తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కన్నెపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. కోడి పందేలు, జూదం, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ,కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# తెలంగాణ ప్రజలను వంచించిన కాంగ్రెస్



- బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 13**

సెప్టెంబర్ 17 తెలంగాణ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అధికారంకంగా నిర్వహించకుండా తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ బారాస ప్రభుత్వాలు వంచనకు గురి చేశాయని బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి టేకుల బస్తి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి తో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణతో పాటు స్వతంత్రం వచ్చిన ప్రాంతాలలో కర్ణాటక మహారాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని తెలంగాణలో రాజకీయ పార్టీలు,మైనార్టీసంతోష్ణీకరణ విధానం అవలంబిస్తున్న ఈ వేడుకలను నిర్వహించడం లో అలసత్వం,వహిస్తున్నాయని ఆయన అన్నారు.. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం గోల్కొండ ఖిలాపై ఉత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దినోత్సవం పేరుతో అసలైన స్వతంత్ర దినోత్సవ వేడుకలను మరుగున పడేయడానికి ప్రయత్నం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ ప్రజల అభీష్టశీ మేరకు కేంద్ర ప్రభుత్వం 2023 నుండి హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగ నిర్వహిస్తుందని ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు సెప్టెంబర్ 13 1948న సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రారంభించిన ఆపరేషన్ పోలో విజయవంతమై సెప్టెంబర్ 17 1948న స్వాతంత్రం వచ్చిన విషయాన్ని 13 నెలల పాటు తెలంగాణ ప్రజలు అధికంగా అనుభవించిన బానిస జీవితాన్ని తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రాచర్ల సంతోష్ కుమార్,వైద్య శ్రీధర్,బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ధార కళ్యాణి, సీనియర్ నాయకులు దూది ప్రకాష్,జీదుల రాములు, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు నల్లుల సంగీత,పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు గాండ్ల మహేష్,బాగ్ మోహన్, పుల్లూరి రాము,పట్టణ కార్యదర్శి దుర్గం కృష్ణ,బీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు సుక్క మల్లేష్,ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు ఇప్ప స్వామి,మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షులు షేక్ గౌస్ బాబా,ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షులు బానోతు సుధాకర్,మహిళా నాయకురాలు చింతకింది లావణ్య,,పుల్లె ప్రశాంత్, కార్యకర్తల మరియు నాయకులు పాల్గొన్నారు.



## నారపల్లిలో ఘనంగా జియారత్ ఏ ఆసారే ముబారక్ కార్యక్రమం

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) సెప్టెంబర్, 13:**

మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీ నారపల్లిలో ఖాన్ ఏ హైదరీయా ఫజలియా తాహేరీయా నా ఆధ్వర్యంలో జియారత్ ఏ ఆసారే ముబారక్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, అసారే ముబారక్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, స్థానిక భక్తులతో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసియాను గెలిచాం

- భారత్‌కు 8వ టైటిల్
- ఫైనల్‌లో శ్రీలంకపై ఏకపక్ష విజయం
- షెఫాలి, స్మృతి అర్ధ శతకాలు

**తెలుగమ్మాయి చరణికి నాలుగు వికెట్లు**




మహిళల ఆసియా కప్‌లో అత్యంత విజయవంతమైన జట్టైన భారత్.. ఈ టోర్నీలో తమ ఆధిపత్యాన్ని మరోసారి చాటిచెప్తూ రికార్డు స్థాయిలో 8వ టైటిల్‌ను వారి ఖాతాలో వేసుకుంది. టోర్నీ చరిత్రలో పదోసారి ఫైనల్ చేరిన టీమిండియా.. టైటిల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంకను చిత్తుచేసింది. ఆదివారం రాత్రి దుబాయ్ వేదికగా పూర్తి ఏకపక్షంగా సాగిన తుదిపోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. 72 పరుగుల తేడాతో లంకేయులను చిత్తుచేసి రెండేండ్ల క్రితం ఇదే టోర్నీలో తమకు ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. మొదట షెఫాలీ వర్మ (39 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68) ధనాధన్ ఆటకు తోడు స్మృతి మంధాన (39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59) అర్ధ శతకాలతో రాణించగా ఉమెన్ ఇన్ బ్లూ 20 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 183 రన్స్ చేసింది. భారీ లక్ష్య ఛేదనలో లంక 20 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ చమారి ఆటపట్టు (36) టాప్ స్కోరర్. తెలుగమ్మాయి శ్రీచరణి (4/20) నాలుగు వికెట్లతో మెరవగా వెటరన్ స్పిన్నర్ దీప్తి శర్మ (3/19) మరోసారి మాయ చేయడంతో లంకేయులు లక్ష్యం దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారు.

### ఓపెనర్ల దూకుడు

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు షెఫాలి, స్మృతి అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. లంక బౌలర్లను అవలీలగా ఎదుర్కొన్న ఈ జోడీ.. ఫస్ట్ వికెట్‌కు 12.5 ఓవర్లలోనే ఏకంగా 129 రన్స్ జోడించి మ్యాచ్‌ను ఏకపక్షం చేసేసింది. స్మృతి పరిస్థితులకు తగ్గట్టు ఆడినా షెఫాలి మాత్రం ఆరంభం నుంచే వేగంగా ఆడింది. చమారి ఐదో ఓవర్లో 4, 6, 6తో రెచ్చిపోయిన ఆమె.. ప్రబోధ బౌలింగ్‌లోనూ రెండు ఫోర్లతో అలరించింది. దిల్హారి బౌలింగ్‌లో బౌండరీతో 24 బంతుల్లోనే ఆమె హాఫ్ సెంచరీ పూర్తయింది. నీలాక్షి 11వ ఓవర్లో 6,4తో మంధాన కూడా టీ20ల్లో 36వ ఫిఫ్టీని సాధించింది. 13వ ఓవర్లో ప్రబోధ బౌలింగ్‌లో షెఫాలి.. చమారి చేతికి చిక్కడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ మరుసటి ఓవర్లోనే స్మృతి సైతం నిష్క్రమించింది. ఈ ఇద్దరూ ఉన్నప్పుడు భారత స్కోరు 200 దాటుతుందని భావించినా తర్వాత వచ్చిన హర్మన్‌ప్రీత్ (14), రిచా ఘోష్ (17), దీప్తి శర్మ (7) ధాటిగా ఆడలేకపోయారు.

### చరణి, దీప్తి మాయకు కుదేలై..

భారీ ఛేదనలో క్రాంతి గౌడ్ తొలి ఓవర్లోనే వికెట్ తీయడంతో లంక ఆత్మరక్షణలో పడింది. చమారి, విష్మి (20).. 9 ఓవర్లు క్రీజులో ఉన్నా వేగంగా పరుగులు రాబట్టలేకపోయారు. దీప్తి పదో ఓవర్లో ఈ ఇద్దర్నీ ఔట్ చేసి లంకకు 'డబుల్' షాకులిచ్చింది. చమారిని రిచా స్టంపౌట్ చేయగా విష్మి క్లీన్‌బౌల్డ్ అయింది. ఇక ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లలో నీలాక్షి మినహా మిగిలినవారెవరూ సింగిల్ డిజిట్ దాటలేకపోయారు. చరణి వరుస ఓవర్లలో హర్షిత (9), కవిష (7), నీలాక్షి, సుగంధిక (1)ను ఔట్ చేసి లంక వెన్ను విరిచింది. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి దీప్తి.. కౌశని (9)ని బౌల్డ్ చేసి ఆ జట్టు ఇన్నింగ్స్‌కు ముగింపు కార్డు వేసింది.

### ఆసియా కప్‌లో భారత్ సాధించిన ట్రోఫీలు

వన్డే ఫార్మాట్‌లో నాలుగు సార్లు (2004, 2005-06, 2006-07, 2008), టీ20ల్లో 2012, 2016, 2022, 2026లో విజేతగా నిలిచింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 183/5 (షెఫాలి 68, స్మృతి 59, మిథాలి 1/33, చమారి 1/34); శ్రీలంక: 20 ఓవర్లకు 111 ఆలౌట్ (చమారి 36, నీలాక్షి 22, చరణి 4/20, దీప్తి 3/19)



## యూఎస్ రిబాకినాదే

సీజన్ నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కజకిస్థాన్ అమ్మాయి ఎలెనా రిబాకినా దక్కించుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ఆర్థర్ ఆషే స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో రిబాకినా.. 6-4, 5-7, 6-2తో డిఫెండింగ్ చాంపియన్ అరీనా సబలెంకా (బెలారస్)కు షాకిచ్చి ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకుంది. ప్రపంచ 1, 2వ ర్యాంకర్ల మధ్య మూడు సెట్ల పాటు 2 గంటల 21 నిమిషాల పాటు సాగిన ఉత్కంఠ పోరులో రిబాకినానే పైచేయి అయింది. న్యూయార్క్‌లో హ్యాట్రిక్ టైటిల్ నెగ్గాలన్న సబలెంకా ఆశలను అడియాసలు చేస్తూ నయా వరల్డ్ నంబర్ వన్ తన కెరీర్‌లో తొలిసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను సాధించింది. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్‌లోనూ సబలెంకాపై గెలిచిన కజకిస్థాన్ ప్లేయర్.. తాజాగా న్యూయార్క్‌లోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తూ ఆమె 'త్రీ పీట్' ఆశలపై నీళ్లుచల్లింది. సెమీస్‌లో గాఫ్‌ను ఓడించి బెలారస్ భామ నుంచి వరల్డ్ నంబర్ వన్ ర్యాంకును సొంతం చేసుకున్న ఈ ఆస్ట్రేలియా ఓపెన్ విన్నర్.. తాజాగా యూఎస్ ఓపెన్‌నూ గెలిచి వారం రోజుల వ్యవధిలోనే తన ప్రత్యర్థికి 'డబుల్' షాకులిచ్చింది. మహిళల సింగిల్స్‌లో 99 వారాల పాటు అగ్రస్థానంలో ఉన్న సబలెంకా స్థానాన్ని వచ్చేవారం నుంచి రిబాకినా ఆక్రమించనుంది.

### స్వయం తప్పిదాలతో..

న్యూయార్క్‌లో వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరి 2023 (ఫైనల్‌లో గాఫ్ చేతిలో ఓటమి) తర్వాత ఓటమన్నదే లేకుండా సాగుతూ 2012-14 (సెరెనా విలియమ్స్) తర్వాత ఇక్కడ హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన సబలెంకా.. స్వయంకృతాపరాధాలతో టైటిల్‌ను చేజార్చుకుంది. మ్యాచ్‌లో మొత్తం ఏకంగా 34 అనవసర తప్పిదాలు చేయడం ఆమె ఓటమికి కారణమయ్యాయి. తొలిసెట్‌లో ఇరువురు నువ్వానేనా అన్నట్టు తలపడ్డా ఆరో గేమ్‌లో గెలిచిన కజకిస్థాన్ ప్లేయర్ 4-2 ఆధిక్యంలోకి వెళ్లింది.



## జయమ్మ క్యారెక్టర్ షూటింగ్ పూర్తి

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రణబాలి' చిత్రంలో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె 'జయమ్మ' అనే కీలకమైన పాత్రను పోషిస్తున్నది. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ఆమెకు వీడ్కోలు తెలుపుతూ చిత్రబృందం భావోద్వేగానికి లోనయ్యారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చారిత్రాత్మక పాన్ ఇండియా చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా 'రణబాలి' విడుదల కానున్నది.

## హృద్యమైన ప్రేమకథ

హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'తెల్ల కాగితం'. రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా నుంచి 'తెలుసా తెలుసా' అంటూ సాగే మెలోడీ గీతాన్ని అగ్ర హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటకు సురేష్ బనిశెట్టి సాహిత్యాన్ని అందించారు. అనుదీప్, లిప్సిక ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికల మధ్య కెమిస్ట్రీతో పాటు విజువల్స్ హైలైట్‌గా నిలిచాయి. హృద్యమైన ప్రేమకథ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: నందు సవిరిగాన, దర్శకుడు: రమేష్ బండ్రెడ్డి.





## ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక..

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రలు పోషిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ పాటను మేకర్స్ విడుదల చేశారు.కొత్త సినిమాలు చూడండి 'కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక.. అరే బాపు రచ్చ లేపు.. ఈడ గుమ్మిగూడాక, మూడు ముళ్ల సంబరాల ఢోలు బాజా కొట్టు.. కొంగుముళ్ల సంతోషాల లొల్లే సూపెట్టు' అంటూ తెలంగాణ మాండలికంలో కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను సురేష్ బొబ్బిలి స్వరపరచగా, జంగిరెడ్డి ఆలపించారు. ర్యాప్ వోకల్స్‌ని కాసర్ల శ్యామ్ పాడారు. పెళ్లి భరాత్‌లో చేసే ఎనర్జిటిక్ మాస్ స్టెప్పులతో ఆడియన్స్ మెచ్చేలా ఈ పాట సాగింది. ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ దూపాటి.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020